# రక్తదానం మహా దానం : ఎమ్మెల్యే వెంకటేశ్



రక్తదానం మహా దానమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బాగ్‌అంబర్‌పేట డివిజన్ శ్రీనివాసనగర్ కాలనీలో ఏకదంత అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దీనిని డివిజన్ కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారిని ఆయన సన్మానించారు. బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, నాయకులు టి. రమేశ్, సురేశ్, మహేశ్వరి, మిర్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

– అంబర్‌పేట, డిసెంబర్ 24

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు..



గాంధీనగర్‌లో జీసస్ ది డోర్ మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై కేక్ కట్‌చేశారు. పాస్టర్ లెర్నుయేల్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం. రాఖేశ్, పాశం రవి, ఆనంద్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. – చిక్కడపల్లి, డిసెంబర్ 24

## 'ప్రతిఫలం' పుస్తకావిష్కరణ



'ప్రతిఫలం' కథా సంపుటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నరసింహప్ప తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 24 : విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రచయిత జస్టిస్ చంద్రకుమార్ రచించిన 'ప్రతిఫలం' కథా సంపుటి పుస్తకాన్ని ఆదివారం సాయంత్రం ఆవిష్కరించారు. సుప్రసిద్ధ కవి, డాక్టర్ బిక్కి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఇన్‌కంట్యాక్స్ చీఫ్ కమిషనర్ ఎం. నరసింహప్ప, విమల సాహితీ సమితి అధ్యక్షుడు డాక్టర్ జల్ది విద్యాధర్, వైఎస్సార్ శర్మ, డాక్టర్ ఎడ్లపల్లి మోహన్‌రావు, డాక్టర్ విజయలక్ష్మి పండిట్, రాజావాసిరెడ్డి మల్లీశ్వరి పాల్గొన్నారు.

## ఎంపీలను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికం

చిక్కడపల్లి, డిసెంబర్ 24 : పార్లమెంట్‌లో చర్చించకుండా ఎంపీలను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమైన చర్య అని సుప్రీం కోర్టు పూర్వ న్యాయమూర్తి సుదర్శన్‌రెడ్డి అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక హక్కులను అణిచివేస్తున్న ఉపా, ఎన్‌ఐఏ లను రద్దు అంశంపై సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370 రద్దు చేయడమంటే ఆ ప్రాంత ప్రజల మనోభావాలను దెబ్బతీయడమే అవుతుందని పేర్కొన్నారు. సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రొఫెసర్ కోదండరాం, ఎన్.వేణుగోపాల్, ఎన్.నారాయణరావు పాల్గొన్నారు.

## ప్రేంనగర్‌లో క్రిస్మస్



అంబర్‌పేట ప్రేంనగర్‌లోని హైమావతి హైస్కూల్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా క్రీస్తును స్తుతిస్తూ విద్యార్థులు పాటలు పాడారు. అహింసకు దూరంగా ఉండాలని మంచి ఆలోచనతో జీవితం సాధించాలని ఉపాధ్యాయులు సూచించారు. – అంబర్‌పేట, డిసెంబర్ 24

## శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ వార్షికోత్సవాలు



విద్యార్థులతోపాటు వార్షికోత్సవాల్లో పాల్గొన్న దూరదర్శన్ యాంకర్ విజయదుర్గ తదితరులు

అంబర్‌పేట, డిసెంబర్ 24: శ్రీసాయి శృతి మ్యూజిక్ అకాడమీ 20వ వార్షికోత్సవాలు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగాయి. అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా దూరదర్శన్ యాంకర్ విజయదుర్గ హాజరయ్యారు. ఈ సందర్భంగా అకాడమీ విద్యార్థులు పాటలు పాడి అలరించారు. మోటివేషన్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్ర, ఈసీఈయూ ప్రధాన కార్యదర్శి జి.తిరుపతయ్య, ప్రముఖ సంగీత విద్యాంసురాలు జయశ్రీ హాజరయ్యారు. టీవీ కళాకారులు గౌరీభట్ల లక్ష్మణమూర్తి సారథ్యంలో స్వర రాగ గానలహరి సంగీత కార్యక్రమం జరిగింది.

## వాజపేయి స్ఫూర్తితో ఆదర్శవంతమైన పాలన

- కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

కవాడిగూడ, డిసెంబర్ 24 : మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి స్ఫూర్తితో నీతివంతమైన పాలనను నరేంద్ర మోదీ ప్రభుత్వం అందిస్తోందని కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. డిసెంబర్ 25న వాజపేయి జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని భారత్ సేవాశ్రమ సంఘ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రిస్టియన్‌లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. వాజపేయి హయాంలో ఎన్నో సంస్కరణలు, అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలతో భారత్ అనేక రకాలుగా అభివృద్ధి చెందిందని అన్నారు. వాల్మీకి అంబేద్కర్ ఆవాస్ యోజన ద్వారా దేశ వ్యాప్తంగా ప్రజల జీవన స్థితిని మెరుగుపరిచేలా ఆశ్రయం కల్పించారని అన్నారు. అలాగే ప్రధాన మంత్రి గ్రామీణ సడక్‌యోజనతో రహదారులను అభివృద్ధి చేశారని తెలిపారు. కార్గిల్ విజయం, పోఖ్రాన్ అణు పరీక్షలతో ప్రపంచానికి భారత శక్తి సామర్థ్యాలు చాటిన వ్యక్తి వాజపేయి అని ఆయన అన్నారు. సుపరిపాలనలో నవభారత నిర్మాణానికి పునాది వేసిన వాజపేయి జయంతిని గుడ్ గవర్నెన్స్‌డేగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అనేక రకాల కార్యక్రమాలు, ఇష్టాగోష్టి సమావేశాలు, పేద ప్రజల కోసం సంక్షేమ కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కులం, మతం, ప్రాంతాలు, భాషలకు అతీతంగా ఐకమత్యంతో ముందుకెళ్లి దేశాన్ని శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దుకునేలా కలిసి మెలిసి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారత్ సేవాశ్రమ్ సంఘ్ హైదరాబాద్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు సామి మునీశ్వరానంద, స్వామి వెంకటేశ్వరనంద తదితరులు పాల్గొన్నారు.

## బీసీల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలి

కాచిగూడ, డిసెంబర్ 24: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో చేర్చిన విధంగా బీసీల డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో గ్రామ పంచాయతి ఎన్నికలు సమీపిస్తున్నందున కులాల వారీగా జనాభా లెక్కలు తీసి బీసీ రిజర్వేషన్ల పెంపునకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అచ్చిని రమేశ్‌కు అభినందన..



అచ్చిని రమేశ్‌ను అభినందిస్తున్న కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి

అంబర్‌పేట, డిసెంబర్ 24 : పని చేసే కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. భారత ప్రభుత్వం 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ అడ్వైజరీ కమిటీ మెంబర్'గా నియమితులైన బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీజేపీ నాయకుడు అచ్చిని రమేశ్‌ను ఆదివారం కిషన్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు చుక్క జగన్, పి.గోవర్ధన్‌రెడ్డి, డి.వెంకటేశ్, ఎస్.వెంకటస్వామిగౌడ్, బి.రాజు, ఎం. రోహిత్‌గౌడ్, ఆర్. రాంరెడ్డి, జి.సాయన్న తదితరులు పాల్గొన్నారు.

## దళితుల ఆర్థిక అభ్యున్నతికి 'డిక్కా' కృషి



'డిక్కా' సంస్థ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న గాలి వినోద్‌కుమార్

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 24 : నిరుపేద మాదిగ, ఉపకులాల ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదిగేందుకు సహరించడానికి 'డిక్కా' సంస్థ కృషి చేయడం అభినందనీయమని ఉస్మానియా లా కళాశాల మాజీ డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. బన్సీలాల్‌పేట్ బీజేఆర్‌నగర్‌లో సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ఆయన మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్ రావుతో కలిసి ప్రారంభించారు. సంస్థ చైర్మన్ రాగటి సత్యం మాదిగ, వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు రాగటి భవానికుమార్ మాట్లాడుతూ.. అణగారిన కులాల పారిశ్రామిక, నిశ్చయ కార్యాచరణ వాణిజ్య మండలి(డిక్కా)పేరుతో రిజిస్టర్డ్ చేయబడిన తమ సంస్థ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీల అభ్యున్నతికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి జాతీయ, రాష్ట్ర, మండల, గ్రామస్థాయిల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు, అవగాహన శిబిరాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆర్థికాభివృద్ధికి అంకిత భావంతో పనిచేయడానికే 'డిక్కా' సంస్థ పనిచేస్తుందని, పేద మాదిగలు నేరుగా బన్సీలాల్‌పేట్ బీజేఆర్ నగర్‌లోని తమ సంస్థ కార్యాలయానికి నేరుగా రావొచ్చని వారు కోరారు. పారిశ్రామికవేత్తలు పుట్టపాక శ్రీనివాస్, చింతా సాంబమూర్తి, డాక్టర్ ఎం.శివకుమార్ లాల్ పాల్గొన్నారు.

# ఆర్య వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌గుప్తా తదితరులు

కవాడిగూడ, డిసెంబర్ 24 : ఆర్య వైశ్యుల సంక్షేమానికి నూతన సీఎం రేవంత్ రెడ్డిని త్వరలో కలిసి ప్రత్యేక ఆర్య వైశ్య కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. ఈ మేరకు ఆదివారం ముషీరాబాద్ వాసవీ హాస్టల్ భవనంలో అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా వైశ్యులందరినీ ఒక ప్లాట్‌ఫాం మీదకు తీసుకువచ్చేందుకు ఫెడరేషన్ కృషి చే స్తుందని అన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పేద వైశ్యులను ఆదుకోవడానికి ఫెడరేషన్ ముందుంటుందని పేర్కొన్నారు. వ్యాపారం, ఉద్యోగం, రాజకీయం, సేవాపరంగా అన్ని పార్టీలు వైశ్యులకు సముచిత స్థానం కల్పించడానికి కృషి చేస్తామని అన్నారు. పేద వైశ్య విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి ఫెడరేషన్ తరపున వసతి, స్కాలర్‌షిప్‌లు ఇతర సౌకర్యాలను సైతం కల్పిస్తామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు రాష్ట్ర, కేంద్ర కమిటీ సభ్యులు రమేశ్, మహేశ్, చంద్రశేఖర్, సత్తయ్య, ఉప్పల స్వప్న, వైశ్యఫెడరేషన్ యువజన సంఘం అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.